సత్తా చాటిన గురుకుల విద్యార్థులు



కే కీర్తన (9.7) సునీల్ (9.8) అక్షయ (9.7) సమీర్ (9.7) భవానీ (9.7) సంధ్య (9.0) లత (9.0) లక్ష్మీనారాయణ (9.7) పావని(9.5)

బాలానగర్ : మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు 10 జీపీఏ సాధించి మరోమారు సత్తా చాటారు. మొత్తం 79 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు. అదేవిధంగా నలుగురు విద్యార్థులు 9.8, 39 మంది విద్యార్థులు 9 జీపీఏ కంటే ఎక్కువ సాధించినట్లు వివరించారు. మండలంలో మొత్తం 502 మందికి 368 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ వెంకటయ్య తెలిపారు.

బాలికలదే పైచేయి..

మహమ్మదాబాద్: పదో ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. నంచర్ల గురుకులలో 95శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఎం ఆకాంక్ష 10, వైశాలి 9.8, ప్రవీణ 9.5, నవిత 9.5 జీపీఏ సాధించారు. మహమ్మదాబాద్ కేజీబీవీలో బొమ్మికుంట తండాకు చెందిన లలిత 9.2 మార్కులు సాధించారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా 853 మందికి 446 మంది ఉత్తీర్ణత సాధించారు.

కోయిల్‌కొండ: మండలంలోని గురుకుల విద్యార్థి మల్లేష్ 10 జీపీఏ సాధించాడు. అదేవిధంగా మండలంలో ఉన్న పది ప్రభుత్వ పాఠశాలల్లో 532 మందికి 335మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గార్లపహాడ్‌లో శిరీష 9.3, కేజీబీవీ భూమిక 9.2, వింజమూర్‌లో నందిని 8.8, కోయిల్‌కొండలో విజయ్‌కుమార్ 8.7, పారుపల్లిలో చందు 8.5 జీపీఏ సాధించి ఆయా పాఠశాలల్లో టాపర్లుగా నిలిచారు.

దేవరకద్ర రూరల్ : మండలంలోని గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. దేవరకద్రలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మైనార్టీ గురుకుల విద్యార్థి అభినవ్ గౌడ్ 10 జీపీఏ సాధించాడు. మొత్తం 760 మందికి 641 మంది ఉత్తీర్ణులయ్యారు. కౌకుంట్ల మండలంలో 216 మందికి 141 మంది ఉత్తీర్ణత సాధించారు.

హన్వాడ: మండలంలో 13 ప్రభుత్వ పాఠశాలకు సంబంధించి 442 మందికి 291మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వేపూర్, హన్వాడ ఉర్దూ మీడియం పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. గురుకులాల్లో (కేజీబీవి 89శాతం, ఎంజేపీ 95శాతం) మెరుగైన ఫలితాలు వచ్చాయి. మిగతా 11ఉన్నత పాఠశాలల్లో గతం కంటే ఈసారి దారుణంగా పడిపోయాయి. మునిమోక్షం అన్నింటికంటే దిగువన (41శాతం) నిలిచింది.

జడ్చర్ల టౌన్: మండలంలో బుధవారం వెలువడిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 68 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 20 ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో 1185 మందికి 807 మంది పాసయ్యారు. పోచమ్మగడ్డతండాలోని గురుకుల(బాలానగర్) విద్యార్థి పి.అభిషేక్ 9.8, ఆలూరు రోడ్‌లోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థి ఆర్.సునీల్‌నాయక్ 9.8 జీపీఏ సాధించారు. అదేవిధంగా బి.సిద్దార్థ 9.7, టీఎంఆర్ఈఐఎస్(బాలికలు)కు విద్యార్థి కీర్తన 9.7 జీపీఏ పొందారు. పెద్ద ఆదిరాల ఇంగ్లిష్ మీడియంలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పోలేపల్లిలో తెలుగు మీడియంకు సంబంధించి అతి తక్కువగా 25శాతం ఉత్తీర్ణత నమోదైంది. పట్టణంలోని 15 ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి 583 మందికి 509 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రేరణ బ్రిలియంట్ విద్యార్థి కౌషిక్ 10 జీపీఏ సాధించాడు

గండేడ్: మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో పదోతరగతి ఫలితాలు అంచనాలను తలకిందులు చేశాయి. ఎక్కడా 100 శాతం ఫలితాలు, 10 జీపీఏ నమోదు కాలేదు. మొత్తం 444 మందికి 268 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మాడల్ స్కూల్‌లో భార్గవి 9.5, రోషనారా, మానస 9.3 , గయాజుద్దీన్, స్నేహ 9.2 జీపీఏ సాధించారు. వెన్నచేడ్‌లో అక్షిత 9.7, సల్కర్‌పేట్‌లో సాయి వర్షిత 9.2, గండేడ్‌లో సమీర్ 9.7 సాధించారు. గండేడ్ బాలికల ఉన్నత పాఠశాలలో 22 మందికి 5 మంది మాత్రమే పాసై మండలంలోనే అత్యల్ప ఉత్తీర్ణత శాతం నమోదైంది. వెన్నాచేడ్ మూడు పాఠశాలలు మినహా మిగతా అన్ని పాఠశాలల్లో 50 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత నమోదు కావడంతో ఉపాధ్యాయుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కువ శాతం గణితంలోనే ఫెయిల్ అయినట్లు పలువురు పేర్కొంటున్నారు.

అడ్డాకుల: పదో తరగతి ఫలితాల్లో మండల వ్యాప్తంగా 97 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. అడ్డాకుల హైస్కూల్‌లో 43 మంది, రాచాలలో 8 మంది, కందూర్‌లో 14 మంది, శాఖాపూర్‌లో 15 మంది, కన్మనూర్‌లో 8 మంది, పొన్నకల్‌లో 9 మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా మూసాపేటలో 20 మంది, జానంపేటలో 22 మంది, నిజాలాపూర్‌లో 17 మంది, వేములలో 14 మంది, మూసాపేట కేజీబీవీలో 25 మంది ఉత్తీర్ణత పొందారు. మూసాపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి వైష్ణవి 10 జీపీఏ సాధించింది.

భూత్పూర్ : మండలంలో 60శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో నాగయ్య తెలిపారు. మొత్తం 424 మందికి 256 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. జానంపేటలో భవానీ 9.7 సాధించింది.

మిడ్జిల్: మండలంలో మొత్తం 207 మందికి 113 మంది ఉత్తీర్ణత సాధించగా 54.58 శాతం ఉత్తీర్ణత నమోదు అయినట్లు ఎంఈఓ మంజులాదేవి తెలిపారు. కేజీబీవీలో సంధ్య, లత 9.0, మిడ్జిల్ పాఠశాలలో శిరీష 8.3 సాధించారు. అదేవిధంగా సెయింట్ మేరిస్ విద్యార్థులు నరేష్, సాత్విక్, విశ్వక్‌సాయి, సృజన 9.2 సాధించారు.

చిన్నచింతకుంట : 74 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 432 మందికి 319 మంది ఉత్తీర్ణులయ్యారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి లక్ష్మీనారాయణ 9.7 సాధించి మండల టాపర్‌గా నిలిచాడు.

నవాబుపేట: మండల కేంద్రంలో 113 మంది విద్యార్థులకు 76 మంది ఉత్తీర్ణత సాధించారు. యన్మన్‌గండ్లలో 56 మంది విద్యార్థులకు 17 మంది, కారుకొండలో 30 మంది, కూచూర్‌లో 18 మంది, ఇప్పటూర్‌లో 20 మంది, పాస్, లింగంపల్లిలో 30 మంది, కేజీబీవీలో 32 మంది ఉత్తీర్ణులు అయ్యారు. లింగంపల్లి జెడ్పీ పాఠశాల పావని 9.5 తో మండల టాపర్‌గా నిలిచింది.

క్లుప్తంగా

ప్రభుత్వం స్పందించే వరకు దీక్షలు



కోయిల్‌కొండ: ప్రభుత్వం స్పందించి గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించేవరకు రిలేదీక్షలు కొనసాగిస్తామని జేఏసీ మండల కన్వీనర్ రామునాయక్, కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. రిలేదీక్షల్లో బుధవారం పాల్గొని మాట్లాడారు. 110 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మండల సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : హన్వాడ 13వ వార్డు సభ్యులు రామచంద్రయ్య, మునిమోక్షం సీపీఎం నాయకులు జాకీర్‌పాషా బుధవారం హైదరాబాద్‌లో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్‌ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సింగిల్‌విండో చైర్మన్ కృష్ణయ్యగౌడ్, చెన్నయ్య, బాలయ్య, హరిచందర్, నాగన్న, జంబులయ్య పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 15వ వార్డు పరిధిలోని చిన్నదర్పల్లి- ఎస్సీకాలనీలో శివాలయం వద్ద, చిర్మల్‌కుచ్చతండాలోని హనుమాన్ టెంపుల్ వద్ద బుధవారం రాత్రి కొత్త హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సాముహిక ఉపనయనాలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని అంబభవాని మందిర్ ఆవరణలో బుధవారం సాముహిక ఉపనయన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మందిరంలో ప్రత్యేక పూజలు చేపట్టి అనంతరం వేద మంత్రోచ్చరణాల మధ్య హోమం చేపట్టి చిన్నారులకు సాముహికంగా ఉపనయనాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణరావు, బాలప్ప, నందు నామాజీ, కమాలపూర్ నాగూరావు, సభ్యులు పాల్గొన్నారు.

కోటకొండను మండలంగా ప్రకటించాలి

నారాయణపేట: నారాయణపేట మండలంలోని కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను బీజేపీ నాయకుడు నాగూరావు నామాజీ ప్రారంభించారు. వీరికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, కుంభం శివకుమార్‌రెడ్డి మద్దతు తెలిపారు. అన్ని రకాల సౌకర్యాలు కలిగిన కోటకొండను తక్షణమే మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రకటించని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అమ్మపల్లికి చెందిన నర్సింహాగౌడ్ కూతురు స్వాతి పెళ్లికి ఎంపీపీ మేఘారెడ్డి రూ.10వేలు ఆర్థికసాయం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలో నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి కుల, మతాలతో సంబంధం లేకుండా ఏ ఆపద వచ్చిన తన వంతు సహాయం అందజేసేందుకు ముందుంటానని ఎంపీపీ తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని పెళ్లి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేసిన ఎంపీపీ మేఘారెడ్డి వధువు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, నారాయణ, రాంచంద్రయ్య, యాదగిరి, తిరుపతి, శాంతన్న, బాలు, కేశవులు తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రుల పోషణ కనీస బాధ్యత

వనపర్తి టౌన్: తల్లిదండ్రులను పోషించకుంటే జైలు శిక్ష అనుభవించే చట్టాలు ఉన్నాయని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమను పోషించడం లేదని చట్టం ముందు నిలబడే స్థాయికి పిల్లలు తెచ్చుకోవడం సమాజానికి శ్రేయస్కరం కాదన్నారు. వారి పూజించాలని పెద్దలు, సంస్కృతి సంప్రదాయాలు నొక్కి చెబుతున్నాయని, పూజించకపోయిన గౌరవించే స్థితికి నేటి తరాన్ని తీర్చిదిద్దడంలో సమాజం కీలక పాత్ర పోషించాలని అభిప్రాయపడ్డారు. వనపర్తి శివారులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 'అమ్మ' వైభవంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. పస్తులు ఉండైన సరే పిల్లల బాగోగుల కోసం పరితపించే నిత్య ప్రేమికులు తల్లిదండ్రులని చెప్పారు. అమ్మను మించిన దైవం, తండ్రిని మించిన ధర్మం ఇలలో లేదన్నారు.

నూతన భవనం ఏర్పాటు

చిన్నచింతకుంట : ఖాతాదారులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు యూనియన్ బ్యాంకు నూతన భవనం ఏర్పాటు చేసినట్లు ఏజీఎం శ్రీనివాస మూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ సోమని, బ్రాంచ్ మేనేజర్ నరసింహారాజు, సర్పంచ్ మోహన్‌గౌడ్, ఎస్సై మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



నవాబుపేట: మండల కేంద్రంలోని సాయి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ రవీందర్, దాత అనంతకృష్ణ, సరస్వతీ, ఎంపీపీ అనంతయ్య, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, సర్పంచ్ గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కో ఆర్డినేటర్‌గా జహీర్ అక్తర్

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్‌డీఎం) చేవెళ్ల కో ఆర్డినేటర్‌గా జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు, మైనార్టీ విభాగం జిల్లా చైర్మన్ జహీర్ అక్తర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్మన్ రాజేష్ లిలోతియా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో ఎల్‌డీఎం కోఆర్డినేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా జహీర్‌కు డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తదితరులు ఘనంగా సన్మానం చేశారు.

చెక్కులు అందజేత



మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో లబ్ధిదారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని పద్మావతికాలనీకి చెందిన హజీరాసుల్తానాకు మంజూరైన రూ. 2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంత్రి శ్రీనివాస్ గౌడ్ బుధవారం అందజేశారు. నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహబూబ్‌నగర్ క్రైం: భూత్పూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబుల్ సురేందర్ కుటుంబ సభ్యులకు తెలంగాణ పోలీస్ భద్రత నుంచి మంజూరైన రూ.7,95,380 చెక్కును బుధవారం ఎస్పీ కె.నరసింహ అందజేశారు. డీఎస్పీ టి.మహేష్, ఏవో రుక్మిణి బాయ్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

జడ్చర్ల: జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య కులాంతర వివాహం చేసుకున్న సోనియా, శ్రీకాంత్‌లకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం తరుపు నుంచి అందే రూ. 2.50 లక్షల ఆర్థికసాయానికి సంబంధించిన చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, కౌన్సిలర్ రఘుగౌడ్, సోషల్ వెల్ఫేర్ డీడీ పాండు, ఇమ్ము తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



భూత్పూర్ : పట్టణంలోని ఉన్నత పాఠశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆనంద్, నాగమణి, లక్ష్మమ్మ మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయం చేశారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ తదితరులు ఉన్నారు. కాగా ప్రమాదంలో మృతి చెందిన వారి అంత్యక్రియలను ఆయా గ్రామాల్లో బాధిత కుటుంబ సభ్యులు బుధవారం పూర్తిచేశారు.

గ్రామీణ క్రీడలను విజయవంతం చేయాలి

చిన్నచింతకుంట : మండల కేంద్రంలో ఈ నెల 16న నిర్వహించే క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. జిల్లా క్రీడా శాఖ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ సువర్ణరాజు, ఎంఈఓ లక్ష్మణ్ సింగ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి

ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి

నవాబుపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుపక్షపాతి అని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య అన్నారు. కారుకొండ, కొండాపూర్, రుద్రారం, కాకర్లపహడ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, రైతు బంధు మండల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా సభ్యుడు చెన్నయ్య, ఎంపీటీసీ గోపాల్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



కొండాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రూ.50,116 విరాళం

అడ్డాకుల: బలీదుపల్లిలో విగ్రహాల ప్రతిష్ఠ కోసం అడ్డాకుల జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి రూ.50,116లను విరాళంగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గణేష్, గ్రామస్తులు శ్రీధర్, నర్సింహ, యాదయ్య సాగర్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనం

జడ్చర్ల టౌన్: గుంటూర్ సమర్థన్ ట్రస్టీ ఆధ్వర్యంలో బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల దివ్యాంగ విద్యార్థులకు బుధవారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. మొత్తం 11మంది విద్యార్థులకు రూ. 99 వేలు అందించినట్లు ప్రిన్సిపాల్ అప్పియ చిన్నమ్మ తెలిపారు. ఉపకార వేతనాలు అందడానికి కృషిచేసిన అధ్యాపకులు విజయ్‌కుమార్, భార్గవి, అనిత, లత తదితరులను అభినందించారు.

బతుకమ్మలతో ఆటపాట



బతుకమ్మ ఆడుతున్న కార్యదర్శులు

● సమ్మె కొనసాగించిన కార్యదర్శులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. అందులో భాగంగా బుధవారం ' పంచాయతీ కార్యదర్శులం ఉయ్యాలో.. రెగ్యులర్ చేయాలని కోరుతున్నాం ఉయ్యాలో..' అంటూ కార్యదర్శులు బతుకమ్మలతో ఆడిపాడుతూ నిరసన వ్యక్తం చేశారు. బతుకమ్మలను మహిళ పంచాయతీ కార్యదర్శులు స్వయంగా పేర్చారు. గ్రామ పంచాయతీల్లో వారు చేసే విధులను తెలుపుతూ తయారు చేసిన బతుకమ్మ ఆకర్షణీయంగా కనిపించింది. ఈ సందర్భంగా తమను రెగ్యులర్‌చేసే దాక కొట్లాడుతామని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విధుల్లో చేరకుంటే టర్మినెంట్ చేస్తామని ప్రభుత్వం చేస్తున్న హెచ్చరికలకు లొంగేది లేదని తేల్చి చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ విధుల్లో చేరాలని మండల అధికారులతో ఒత్తిడి చేయిస్తున్నారని ఆరోపించారు. కార్యదర్శులు విధుల్లో చేరుతున్నారని అసత్య ప్రచారం చేస్తూ మనో ధైర్యాన్ని దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ బెదిరింపులకు ఎట్టి పరిస్థితుల్లో లొంగమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 391 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారని తమను రెగ్యులర్ చేసేదాక పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమ్మె విరమించకుంటే టర్మినెట్ చేస్తామనే హెచ్చరికలను పట్టించుకోబోమని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెపై కేసీఆర్ ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతోందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్ అన్నారు. పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు ఆయన మద్దతుతెలిపి మాట్లాడారు. ప్రభుత్వానికి ప్రజలకు సంక్షేమ వారధిగా పని చేస్తున్న కార్యదర్శులను రెగ్యులర్ చేయకుండా హింసిస్తోందని ఆరోపించారు. కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి లక్ష్మీకాంత్, ఉపాధ్యక్షుడు పాండు శ్రీలత, కృష్ణ, వేణు, జానేశ్వర్, సింధుజా, సంతోష్, శ్రీను, చెన్నకేశవులు, రవి, రఘుపతిరెడ్డి, నర్మద, శిరీషా, రాఘవేందర్‌గౌడ్, హాజీ, వెంకట్‌రాములు, రాకేష్, వెంకటేశ్, మణి, సరస్వతి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మితో పేదలకు భరోసా



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో లబ్ధిదారులు

మిడ్జిల్: పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి ఎంతో భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలో 99 మంది లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ కొత్త ఛాంబర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. జెడ్పీటీసీ శశిరేఖా, తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి, ఎంపీడీఓ సాయిలక్ష్మి, వైస్‌ఎంపీపీ తిరుపతమ్మ, డీటీ గీతా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగలో..

జడ్చర్ల: బొడ్రాయి పండుగలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కావేరమ్మపేటలో ఏర్పాటు చేసిన బొడ్రాయికి పూజలు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భవనం నిర్మించాలని వినతి

మిడ్జిల్: మండల కేంద్రంలో గౌడ సంఘం భవన నిర్మాణం చేపట్టాలని నాయకులు బుధవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. సత్యంగౌడ్, జగన్‌గౌడ్, సురేందర్‌గౌడ్, నరేష్‌గౌడ్ ఉన్నారు.

బాలానగర్ : పనిచేసే నాయకుడికి గుర్తింపు వాటంతట అదే వస్తుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బాలానగర్ లో బుధవారం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ వెంకటచారి, అభిమన్యు రెడ్డి, గోపాల్ రెడ్డి, యాదగిరి గౌడ్, ప్రకాష్, సుధార్ గౌడ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజాపూర్ : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బుధవారం మండల కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి, ఎంపీపీ సుశీల, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్‌లు మల్లేష్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రమాణస్వీకారం

నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయ నూతన చైర్మన్‌గా కాకర్లపహాడ్‌కు చెందిన కృష్ణయ్య గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని దేవాలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రానున్నట్లు వివరించారు. కాగా కృష్ణయ్య ఆలయానికి నాలుగో చైర్మన్ కానున్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం కార్లపహాడ్‌కు చెందిన జగన్‌మోహన్‌రెడ్డి మొదటి చైర్మన్‌గా ఎన్నిక కాగా అనంతరం వేణాచారీ, గోపాల్ బాధ్యతలు నిర్వర్తించారు. వీరందరూ కాకర్లపహాడ్ వాసులే కావడం విశేషం.

బీసీ కులగణన చేయడంలో విఫలం

నారాయణపేట టౌన్: కేంద ప్రభుత్వం బీసీ కులగణన చేపడతామని హామీ ఇచ్చి మాట తప్పిందని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీహార్ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 7 నుంచి 21 వరకు తొలి విడత కులగణన నిర్వహించిందని, రెండో విడత ఏప్రిల్ 15 నుంచి మే 15వ తేదీ వరకు చేపడతారన్నారు. రాష్ట్ర పరిధిలో బీసీ కులగణన చేపట్టి సంఖ్యను బహిర్గతం చేయాలని ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ముందుకు రావడం హర్షణీయమన్నారు. బీసీ జనాభా లెక్కలు బయటికి వస్తే రాజకీయంగా హక్కులను కాలరాసిన విషయం బహిర్గతమవుతుందని, బీసీ వ్యతిరేక శక్తులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసి కులగణనను అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. బీసీ హక్కుల పోరాటంలో భాగస్వాములై వ్యతిరేక పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీ రావు, వెంకటేషయాదవ్, వెంకటేష్, వీరప్ప, బాలరాజ్, రాములు, నాగయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి

నారాయణపేట టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు వరం లాంటి ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టవంతంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని శ్యాసన్‌పల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతూ.. ఎండాకాలంలో కూలీలు వడదెబ్బకు గురవుతున్నారని, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు సరఫరా చేయాలన్నారు. చట్టంలో కూలీలకు 14 రోజుల్లో డబ్బులు ఇవ్వాలని ఉన్నా, అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గత బడ్జెట్ కన్నా ఈ సారి 20 శాతం నిధులు తగ్గించిందని విమర్శించారు. క్రమంగా ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేసే కుట్ర సాగుతుందని ఆరోపించారు. కూలీలు ఐక్యంగా పోరాడి చట్టాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మోహన్, రామకృష్ణ, వెంకటప్ప, అంజప్ప, రాజేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిబిరం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రెమావర్షిప్ సెంటర్‌లో వేసవి సెలవులను పురస్కరించుకొని ఈనెల 8 నుంచి నిర్వహిస్తున్న చిన్నారుల శిబిరం బుధవారం ముగిసింది. సెంటర్ డైరెక్టర్ బీఎస్ పరంజ్యోతి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు చిన్నారులకు సంగీతం, పాటలు, పప్పెట్, మ్యాజిక్ షో, ఆటలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన చిన్నారులకు సూపర్‌కిడ్స్ అవార్డులు అందజేశారు. సంఘం పెద్దలతోపాటు ప్రియ, ఆమ్స్టర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న పరంజ్యోతి

తాగునీటికి శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే



వెన్నాచేడ్‌లో గ్రంథాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: గ్రామాల్లో తాగునీరు, కరెంటు సమస్యలకు బీఆర్ఎస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. కప్లాపూర్, గోవిందపల్లి, రంగారెడ్డిపల్లి, వెన్నాచేడ్, జక్లపల్లి, జిన్నారం, జిన్నారం తండాల్లో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన పర్యటించారు. వెన్నాచేడ్‌లో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. కప్లాపూర్‌లో గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం సీసీ రోడ్లు, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రెడ్డిపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామని, గండేడ్ నుంచి బల్సూర్‌గొండ వరకు బీటీ రోడ్డును వారం రోజుల్లో పూర్తి చేయిస్తామని, వెన్నచేడ్‌లో నూతన సబ్‌సెంటర్, గ్రంథాలయం తదితరాల ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.